


సగానికి పైగా విద్యావంతులే..

ఎన్నికల బరిలో నిలిచిన వారిలో అత్యధికులు విద్యావంతులే.. ఉన్నత విద్య పూర్తి చేసి వృత్తులు, వ్యాపారాలు వదిలి ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చారు. 10లో▸



కారు జోరా?.. 'హస్త'గతమా?

ఉద్యమాల పురిటిగడ్డగా పేరున్న సింగరేణిలో కార్మికవర్గం ఎప్పుడూ విలక్షణమైన తీర్పు ఇస్తోంది. కార్మికుల అండ ఏ జెండాకు ఉంటుందని చర్చ జరుగుతోంది. 10లో▸

గరిష్టం/కనిష్టం
32.4 /19.0

వాతావరణం

చాలావరకు ఎండగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. చలి ప్రభావం పెరిగింది.

న్యూస్‌రీల్

రేపు జిల్లాకు ప్రియాంక గాంధీ రాక



సభాస్థలిని పరిశీలిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆదివారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రానికి రానున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాదరావు తెలిపారు. బీఎస్ఎన్ఎల్ టవర్ ఎదుట ఏర్పాటు చేసే బహిరంగ సభలో ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్యాంనాయక్, పార్టీ శ్రేణులతో కలిసి ఆయన శుక్రవారం సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ బహిరంగ సభకు జిల్లాలోని పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆసిఫ్ అలీ, పార్టీ మండల అధ్యక్షుడు మసాదే చరణ్, ఎండీ ఇస్మాయిల్, ఆర్బాస్, సక్లైన్, గులాం జావేద్, వైరాగడే శంకర్ ఉన్నారు.

పెరిగిన చలి తీవ్రత

తిర్యాణి(ఆసిఫాబాద్): జిల్లాలో రెండు రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. సిర్పూర్(యూ) మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున జిల్లాలోనే అత్యల్పంగా 12.1 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే తిర్యాణి మండలం గిన్నెధరిలో 13.5, కెరమెరిలో 14.7, కాగజ్‌నగర్‌లో 15.9, రెబ్బెనలో 16.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



శిరీషను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అనిత

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని శిరీష జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. కళాశాలలో శుక్రవారం పీడీ లక్ష్మి, గుర్విందర్, వైస్ ప్రిన్సిపాల్ తాటి అనితతో కలిసి విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 9న జరిగిన పోటీల్లో ఉత్తమ చూపిందని తెలిపారు. ఈ నెల 21 నుంచి 24 వరకు పంజాబ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో శిరీష పాల్గొంటుందని ఆమె పేర్కొన్నారు.

ఖోఖోలో విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులతో పీడీ

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు డీటీడీవో రమాదేవి శుక్రవారం తెలిపారు. మెదక్ జిల్లా తుప్రాన్‌లో ఈ నెల 15 నుంచి 17 వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు తరపున పాల్గొన్న క్రీడా పాఠశాలకు చెందిన నందిని, సోని, వైష్ణవి, సత్యశీల, జంగుబాయి, సరోజ, శ్రీలత, నాగేశ్వరి సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా జట్టులో 15 మందికి గాను 8 మంది ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉండటం సంతోషకరమన్నారు. రాష్ట్రస్థాయిలో రాణించిన క్రీడాకారులను ఏసీఎంతో ఉద్ధవ్, డీఎస్‌వో సాంబశివరావు, శిక్షకుడు విద్యాసాగర్ ప్రత్యేకంగా అభినందించారు.

డిగ్రీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థులకు డిగ్రీ నుంచే ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు అవసరమైన ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం తెలిపారు. శిక్షణలో భాగంగా ప్రతిరోజూ ఉదయం 9 నుంచి జనరల్ స్టడీస్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నమూనా పరీక్ష నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మహాలక్ష్మయ్య, కవిత పాల్గొన్నారు.

నిఘా నీడలో..!



- సమస్యాత్మక కేంద్రాలపై అధికారులు, పోలీసుల దృష్టి
- నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలపై డేగ కన్ను
- మావోయిస్టుల పేరిట లేఖలు విడుదల కావడంతో మరింత అప్రమత్తం
- పారామిలటరీ బలగాలతో నిత్యం పహారా
- పటిష్ట భద్రత మధ్య ఎన్నికల నిర్వహణకు చర్యలు



పారామిలటరీ బలగాలతో కలిసి కవాతు నిర్వహిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

సాక్షి, ఆసిఫాబాద్: శాసనసభ ఎన్నికలకు గడువు సమీపిస్తోంది. అభ్యర్థులు ప్రచార హోరు పెంచారు. ఈ క్రమంలో జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంతోపాటు ఓటర్లు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా జిల్లా పోలీసులు పటిష్ట భద్రత మధ్య ఎన్నికలు నిర్వహించేలా నిఘా పెంచారు.

డేగ కళ్లతో నిఘా..

కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల పరిధిలో 'బూటకపు అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలి' అంటూ మావోయిస్టుల పేరిట విడుదల చేసిన లేఖలు అటు పోలీసులు.. ఇటు రాజకీయ వర్గాల్లో కలవరం సృష్టిస్తున్నాయి. సాధారణ ఎన్నికల సమయంలో అప్రమత్తంగా ఉండే పోలీసులు.. మావోయిస్టుల లేఖలతో మరింత అప్రమత్తమయ్యారు. ప్రధానంగా ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించారు. పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. నిత్యం పోలీసులు, పారామిలటరీ దళాలతో గస్తీ ముమ్మరం చేయడమే కాకుండా డేగ కళ్లతో పహారా కాస్తున్నారు.

విస్తృతంగా తనిఖీలు

ప్రశాంత వాతావరణలో ఎన్నికల నిర్వహణకు పోలీసుశాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంది. ఎస్పీ కె.సురేశ్‌కుమార్ నేతృత్వంలో జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు, కార్డెన్‌సెర్చ్‌లు చేపడుతున్నారు. అంతర్రాష్ట్ర, అంతర్‌జిల్లా సరిహద్దుల్లో మొత్తం ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. శుక్రవారం నాటికి జిల్లాలో రూ.2.30 కోట్ల నగదు.. రూ.7.98 లక్షల విలువైన మద్యం, 468 గంజాయి మొక్కలు, 182 మొబైల్ ఫోన్లు, 100 టిఫిన్ బాక్స్‌లు పట్టుకున్నారు. అలాగే ఎన్నికల కోసం జిల్లా పోలీసులు, సిబ్బంది, కేంద్ర పారామిలటరీ బలగాలు కలిపి 600 మందికిపైగా పనిచేస్తున్నారు. ఎన్నికల నాటికి మరిన్ని బలగాలు రానున్నాయని అధికారులు తెలిపారు. ఇక మావోయిస్టుల లేఖల కలకలంతో ఎన్నికల సంఘం కూడా జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసుల బందోబ(మ)స్తు మరింత పెరిగే అవకాశం ఉందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

పారామిలటరీ బలగాలతో కవాతు..

కుమురంభీం జిల్లా సరిహద్దున మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి మావోయిస్టుల ప్రభావం ఉండే అవకాశం ఉంది. జిల్లాలో మొత్తం 597 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 432 సాధారణ పోలింగ్ కేంద్రాలతోపాటు 92 సమస్యాత్మక, 73 లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రీమిస్ట్(ఎల్‌డబ్ల్యూఈ) కేంద్రాలు ఉన్నాయి. ఇరు రాష్ట్రాల పోలీసుశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక చర్యలు చేపట్టారు. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని గ్రామాల్లో ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రత్యేక పోలీసు బలగాలతో అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో కేంద్ర పారామిలటరీ బలగాలతో కవాతు నిర్వహించి ప్రజకు భరోసా కలిగిస్తున్నారు.

ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ బోర్కడే
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి విడత సప్లిమెంటరీ బ్యాలెటింగ్ యూనిట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ రిటర్నింగ్ అధికారి దాసరి వేణుతో కలిసి శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి సప్లిమెంటరీ బ్యాలెటింగ్ యూనిట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి 17 మంది అభ్యర్థులు బరిలో ఉండడంతో 305 పోలింగ్ కేంద్రాలకు రెండో బ్యాలెటింగ్ యూనిట్ అవసరం ఉంటుందన్నారు. 20 శాతం అదనంతో 382 బ్యాలెటింగ్ యూనిట్లను మొదటి సప్లిమెంటరీ బ్యాలెటింగ్ యూనిట్ల ర్యాండమైజేషన్ చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక రక్షణ ఏర్పాట్లతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వెబ్ కాస్టింగ్ ద్వారా రికార్డింగ్ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించిన ఈవీఎం గోదాంలోని బ్యాలెట్ యూనిట్లను పీటీజీ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు తరలించారు. సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు మేనిఫెస్టోలో పెట్టాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. గోలేటిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 40వేల మంది కాంట్రాక్టు కార్మికులను రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల సందర్భంగా వారి సమస్యలను సైతం పరిగణలోకి తీసుకుని పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, కోల్ ఇండియా వేతనాలు గానీ జీవో 22ను అమలు చేయాలన్నారు. ఖాళీ క్వార్టర్లు కాంట్రాక్టు కార్మికులకు కేటాయించాలని, ఓబీలతో సహా అన్నింటిలో స్థానికులకే పని కల్పించాలని అన్నారు. కార్మికుల కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించాలని, గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేటగిరీ ఆధారంగా వేతనాలు చెల్లించాలని, సీఎంపీఎఫ్, కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. కార్మిక సమస్యపై స్పందించే రాజకీయ పార్టీలకే కాంట్రాక్టు కార్మికుల మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

స్వేచ్ఛాయుత ఎన్నికలే లక్ష్యం

- పోలీసు అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి
- ఎస్పీ సురేశ్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా పోలీసు అధికారులు, సిబ్బంది ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు అధికారులకు విధులు, విధివిధానాలు, శాంతిభద్రతల పరిరక్షణ, తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పనిచేయాలని, ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు అధికారులకు సంబంధిత పోలీసుస్టేషన్ పరిధిలో ఉండే పోలింగ్ కేంద్రాలపై అవగాహన ఉండాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో నిత్యం పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. రౌడీ షీటర్లు, దొంగ సారా వర్తకులు, ఇతర నేరస్తులను గుర్తించాలన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రానికి నిర్దిష్టమైన బందోబస్తు ఉండాలని, గతంలో చోటుచేసుకున్న ఘటనలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. సమస్యలు సృష్టించేందుకు అవకాశం ఉన్న సోషల్ మీడియా సందేశాలు, వీడియోలపై ఉన్నతాధికారులను సమాచారం అందించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమేశ్, ఎస్బీ సీఐ రాణాప్రతాప్, డీసీఆర్‌బీ సీఐ రమేశ్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థుల ఖర్చుల వివరాలు పరిశీలన

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా అబ్జర్వర్ అనన్లై భాటియా అభ్యర్థుల ఖర్చుల వివరాలు పరిశీలించారు. నామినేషన్లు దాఖలు చేసిన రోజు నుంచి గురువారం వరకు అభ్యర్థుల పార్టీ ఏజెంట్ల వద్ద ఉన్న ఖర్చుల వివరాలను తనిఖీ చేశారు. ఆయన వెంట అసిస్టెంట్ ఖర్చుల పరిశీలకులు శంకరయ్య, సతీశ్ ఉన్నారు.



వివరాలు పరిశీలిస్తున్న జిల్లా అబ్జర్వర్

భక్తిశ్రద్ధలతో నాగులచవితి



ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో భక్తులు నాగుల చవితి పండుగను శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక కేస్లాపూర్ నాగదేవత ఆలయంలోని పుట్టలో పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే పట్టణంలోని జన్కాపూర్, సందీప్‌నగర్, హైకాజీనగర్, హడ్కోకాలనీ, రావులవాడ, బ్రాహ్మణవాడ కాలనీల్లో భక్తులు పుట్టల్లో పాలుపోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముందస్తు కసరత్తు!

- గ్రామాల్లో మొదలైన నర్సరీల ఏర్పాటు పనులు
- ఈ నెలాఖరు నాటికి బ్యాగుల్లో మట్టి నింపేలా ప్రణాళిక
- ఈ ఏడాది హరితహారం లక్ష్యం: 55 లక్షల మొక్కలు



రెబ్బెన మండలం రాంపూర్ నర్సరీలో చదును పనులు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి



బ్యాగుల్లో నింపేందుకు సేకరించిన మట్టి

రెబ్బెన(ఆసిఫాబాద్): హరితహారం కార్యక్రమం ద్వారా నాటే మొక్కల పెంపకానికి అధికార యంత్రాంగం ముందస్తు కసరత్తు ప్రారంభించింది. ఏటా డిసెంబర్ చివర్లో ప్రారంభమయ్యే మొక్కల పెంపకం పనులు ఈసారి కాస్త ముందుగానే మొదలయ్యాయి. పంచాయతీల వారీగా లక్ష్యాలు నిర్ణయించి అందుకు అనుగుణంగా నర్సరీల ఏర్పాటు పనులు వేగవంతం చేస్తున్నారు.

55లక్షల మొక్కల లక్ష్యం..

2024 జూన్, జూలై నాటికి హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటేందుకు మొక్కలు అందుబాటులో ఉండేలా అధికారులు కార్యాచరణ మొదలుపెట్టారు. అన్నిశాఖలు కలిపి 55లక్షల మొక్కలు హరితహారం ద్వారా నాటాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఇందులో భాగంగా డీఆర్‌డీఏ ద్వారా 35లక్షల మొక్కలు పెంచనున్నారు. అయితే వాస్తవ లక్ష్యానికి మరో 15 శాతం అదనంగా మొక్కలు పెంచాలని అధికారులు భావిస్తున్నారు. దీంతో డీఆర్‌డీఏ ద్వారా మొత్తం 43.60లక్షల మొక్కలను నర్సరీల ద్వారా సిద్ధం చేయనున్నారు. ప్రతీ పంచాయతీలో ఏర్పాటు చేస్తున్న నర్సరీల ద్వారా మొక్కలు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. సాధారణంగా డిసెంబర్ నెలాఖరులోగాని, జనవరి మొదటి వారంలో నర్సరీ ఏర్పాటు పనులు ప్రారంభిస్తారు. ఈసారి మాత్రం అధికారులు ముందస్తుగా నర్సరీల ఏర్పాటుపై దృష్టి సారించారు. ఓ వైపు జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల విధుల్లో బిజీగా ఉంటూనే మరోవైపు మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. జీపీల వారీగా ఇప్పటికే లక్ష్యాలు నిర్ణయించి, అందుకు అనుగుణంగా మొక్కల పెంపకం చేపట్టేలా చూస్తున్నారు. జూలై నాటికి జిల్లావ్యాప్తంగా అన్ని నర్సరీల్లో మొక్కలు సిద్ధమయ్యేలా చర్యలు చేపట్టారు. ముందస్తు నర్సరీ ఏర్పాటు ప్రక్రియ ద్వారా మొక్కలు నిర్ణీత ఎత్తులో పెరిగేందుకు ఆస్కారం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఎవెన్యూ ప్లాంటేషన్‌పై దృష్టి..

గతంతో పోల్చితే ఈసారి ఎవెన్యూ ప్లాంటేషన్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఏటా హరితహారం కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలు నాటుతున్నారు. దీంతోపాటు రోడ్లకిరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్, మల్టీలేయర్ ఎవెన్యూ ప్లాంటేషన్‌ను చేపడుతున్నారు. హోంసీడ్స్, బండ్ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్‌కు ప్రాధాన్యత కల్పిస్తూనే.. ఎవెన్యూ ప్లాంటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. దీని కోసం నర్సరీల్లో ఏపుగా పెరిగే జాతి మొక్కలు పెంచాలని నిర్ణయించారు. జూలైలో హరితహారం కార్యక్రమం చేపట్టే నాటికి మొక్కలు కనీసంగా మీటర్ ఎత్తు ఉండేలా చూసుకోవాలని పంచాయతీ అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేశారు. దీంతో జిల్లావ్యాప్తంగా నర్సరీల ఏర్పాటు పనులు ముందస్తుగా ప్రారంభమయ్యాయి. నర్సరీల స్థలాలు చదును చేసి సైట్‌ను క్లియర్ చేయడంతోపాటు కొన్ని జీపీల్లో మట్టి సేకరణ పనులు పూర్తి చేశారు. మరో వారం రోజుల్లో బ్యాగుల్లో మట్టి నింపే పనులు చేపట్టి, డిసెంబర్‌లో విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారు.

పండ్లు, పూలు, అటవీజాతి మొక్కలు

పండ్లు, పూలజాతి, అటవీజాతి మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. హోంసీడ్స్‌లో భాగంగా గ్రామాల్లో పంపిణీ చేసేందుకు జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, ఉసిరి, అల్లనేరేడు, పూలజాతిలో మందార, గులాబీ, గోరంటా వంటి మొక్కలు అందుబాటులో ఉంచనున్నారు. పండ్ల మొక్కలు పంపిణీ చేయటంతోపాటు బండ్ ప్లాంటేషన్‌గా ఏర్పాటు చేసేలా ప్రజలను ప్రోత్సహించాలని అధికారులు భావిస్తున్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్ కోసం అటవీజాతి మొక్కలను పెంచాలని ప్రణాళికలు సిద్ధం చేశారు.

అన్ని పంచాయతీల్లో పనులు

జిల్లాలోని అన్ని పంచాయతీల్లో నర్సరీల ఏర్పాటు పనులు సాగుతున్నాయి. సైట్ క్లియరెన్స్ పనులు పూర్తి కాగా కొన్ని పంచాయతీల్లో మట్టి సేకరణ సైతం పూర్తి చేశారు. మరో రెండు, మూడు రోజుల్లో మట్టి నింపే బ్యాగులు సైతం రానున్నాయి. ఈ నెలాఖరు నాటికి బ్యాగ్ ఫిల్లింగ్ పనులు సైతం పూర్తిచేస్తాం. ఈసారి డీఆర్‌డీఏ ద్వారా జిల్లాలో 35 లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యం పెట్టుకున్నాం. నర్సరీల్లో మరో 15 శాతం అదనంగా మొక్కలు సిద్ధం చేసేలా ప్రణాళికలు రూపొందించాం.

– సురేందర్, డీఆర్‌డీవో

రంగయ్యకు 'సాక్షి' ఎక్స్‌లెన్స్ అవార్డు

కెరమెరి(ఆసిఫాబాద్): జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కెరమెరి మండలం సావర్‌ఖేడా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడేర్ల రంగయ్యకు మరో గౌరవం దక్కింది. సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యా విభాగంలో 'సాక్షి' ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా జ్ఞాపికతోపాటు ప్రశంసా పత్రం అందుకున్నారు. కాగా రంగయ్య ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సూపర్–100 కార్యక్రమం అమలు, గ్రామాభివృద్ధి కోసం, మద్యపాన నిషేధం కోసం కృషి చేశారు. ఎఫ్ఎం సావర్‌ఖేడా వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఆయన పిల్లలు సైతం అదే పాఠశాలలో ఏడో తరగతి వరకు చదవగా, ఆయన సతీమణి ఉచితంగా విద్యాబోధన చేస్తున్నారు.



రంగయ్యకు అవార్డు అందిస్తున్న ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, పక్కన వైఎస్ భారతి

గవర్నర్ అభినందన

'విద్యార్థులే కాదు.. గ్రామాన్ని కూడా నాదే అనుకుని ప్రజలను దురలవాట్లను దూరం చేసి ప్రజలను సన్మార్గంలో నడిపించారు. మద్యపాన నిషేధం కోసం నిరాహార దీక్ష చేశారు. చాలా మంది అభిమానాన్ని చూరగొన్నారు..' అని రంగయ్యను ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే పాఠశాల, గ్రామాభివృద్ధికి మీ కుటుంబం చేసిన సేవలు మరువలేనివని వైఎస్ భారతీరెడ్డి కొనియాడారు. విద్యావలంటీర్లు, ఉపాధ్యాయులతోనే ఇంతటి అభివృద్ధి సాధ్యమైందని, అవార్డు రావడం మరింత బాధ్యత పెంచిందని రంగయ్య 'సాక్షి'కి తెలిపారు.

క్లుప్తంగా

తాగిన మైకంలో ఉరేసుకుని ఆత్మహత్య

రెబ్బెన(ఆసిఫాబాద్): మండల కేంద్రానికి చెందిన మిట్ట రామయ్య (45) తాగిన మైకంలో గురువారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. లారీ డ్రైవర్‌గా పని చేసే రామయ్యకు 20 ఏళ్ల క్రితం నారాయణపూర్‌కు చెందిన శారదతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసైన రామయ్య రోజూ తన తల్లితోపాటు భార్యాపిల్లలతో గొడవపడేవాడు. ఇది భరించలేని శారద తన ఇద్దరు పిల్లలను నారాయణపూర్‌లోని తన పుట్టింటికి పంపించింది. అయినప్పటికీ రామయ్యలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో ఇటీవల అతడి తల్లి మరో కొడుకు ఇంటికి వెళ్లగా, శారద కూడా భర్తను వదిలి నారాయణపూర్‌లోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. గురువారం శారద తిరిగి భర్త వద్దకు రాగా, ఇంట్లో ఉన్న టీవీ, ఫ్రిజ్ తదితర సామగ్రి ధ్వంసమై ఉంది. ప్రశ్నించిన శారదను అప్పటికే మద్యం సేవించిన రామయ్య చితకబాదాడు. దీంతో శారద స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రామయ్యపై కేసు నమోదైంది. ఈక్రమంలో తాగిన మైకంలో జీవితంపై విరక్తి చెందిన రామయ్య గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపిస్తున్న ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి: బెల్లంపల్లి కూరగాయల మార్కెట్ ఏరియాలో గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని పోలీసులు పట్టుకున్నారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం కాంటా చౌరస్తా శివారు ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మార్కెట్ ఏరియాకు చెందిన మహ్మద్ తాజ్ అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. అతడి వద్ద 140 గ్రాముల గంజాయి లభించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థిని



మనీషాకు ప్రశంసాపత్రం ఇస్తున్న స్వప్న

మంచిర్యాలఅర్బన్: ఈనెల 16న హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళోత్సవ్ సోలో డ్రామా అంశంలో స్థానిక కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న మనీషా అత్యుత్తమ ప్రదర్శనతో జాతీయస్థాయికి ఎంపికైంది. శుక్రవారం కేజీబీవీలో మనీషాను కేజీబీవీ ఎస్వో స్వప్న జిల్లా విద్యాశాఖ అందించిన ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. జాతీయస్థాయిలో రాణించి గుర్తింపు తేవాలని సూచించారు. ఉపాధ్యాయినులు మనీశాను అభినందించారు.

సగానికి పైగా విద్యావంతులే..



- ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి..
- గెలిచి అభివృద్ధి చేయాలని తలచి వివిధ పార్టీల నుంచి బరిలోకి..

మంచిర్యాలటౌన్: వారంతా విద్యాధికులే.. ఉన్నత లక్ష్యంతో డిగ్రీ, పీజీ, ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసినవారే. వివిధ వృత్తులు, వ్యాపారాలు చేస్తూనే ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చారు. ఆయా పార్టీలో చేరి ప్రస్తుతం అసెంబ్లీ బరిలో నిలిచారు. పార్టీ అభ్యర్థులుగా, స్వతంత్రులుగా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

మంచిర్యాల నియోజకవర్గంలో..

మంచిర్యాల నియోజకవర్గంలో పోటీ చేస్తున్న వివిధ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు 17 మంది బరిలో నిలువగా ఇందులో సగానికి పైగా ఉన్నత విద్యను అభ్యసించినవారే. ప్రధాన పార్టీల అభ్యర్థులు డిగ్రీ, ఆపైన చదివిన వారుండగా, ఉన్నత చదువు చదివి, మంచి ఉద్యోగాలు, వృత్తుల్లో ఉన్నవారు ప్రజాసేవ చేసేందుకు ఎన్నికల బరిలో నిలిచారు. వీరిలో 25 నుంచి 71 ఏళ్లవారున్నారు. వయస్సు, చదువుతో నిమిత్తం లేకుండా రాజకీయాల్లో రాణిస్తున్న వారెందరో ఉండగా, మంచిర్యాల నియోజకవర్గంలో మాత్రం ఉన్నత చదువులతో పాటు, మంచి వృత్తిలో ఉన్నవారు కూడా ఈసారి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి, ప్రజాసేవ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 51 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి రఘునాథ్ వెరబెల్లి అమెరికా యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి పలు కంపెనీలను నెలకొల్పారు. ప్రస్తుతం ప్రజాసేవ చేసేందుకు ఎన్నికల బరిలో నిలిచారు. 63 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు బీఎస్సీ చదివి వ్యాపారం చేస్తున్నారు. 71 ఏళ్లున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు బీఏ చదివారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజాసేవ చేస్తున్నారు. 41 ఏళ్లున్న బీఎస్పీ అభ్యర్థి తోట శ్రీనివాస్ బీఎస్సీ చదివి ఆర్‌ఎంపీగా, నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. 48 ఏళ్లున్న బహుజన రిపబ్లికన్ సోషలిస్ట్ పార్టీ అభ్యర్థి చెరుకూరి శాంతశ్రీ ఎమ్మెస్సీ ఎల్‌ఎల్‌బీ చదివి సోషల్ వర్క్ చేస్తున్నారు. 39 ఏళ్లున్న ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి దొమ్మటి రవికుమార్ ఎమ్మెస్సీ చదివి వ్యవసాయం చేస్తూ బరిలో నిలిచారు.

బెల్లంపల్లి నియోజకవర్గంలో..

బెల్లంపల్లి: బెల్లంపల్లి బరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు నలుగురు తలపడుతున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థులుగా దుర్గం చిన్నయ్య, గడ్డం వినోద్, అమురాజుల శ్రీదేవి, జాడి నర్సయ్య పోటీలో ఉన్నారు. చిన్నయ్య, గడ్డం వినోద్, శ్రీదేవి ఇదివరకే ఎమ్మెల్యేలుగా గెలిచి చట్టసభలో అడుగు పెట్టారు. 52 ఏళ్లున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్యది వ్యవసాయ కుటుంబం. ఐటీఐ చదివి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. భార్య, ఇద్దరు కుమార్తెలు కలిగిన చిన్నయ్య మూడోసారి బరిలో ఉన్నారు. 67 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ రాజకీయ, పారిశ్రామిక కుటుంబంలో జన్మించారు. డిగ్రీ చదివిన వినోద్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. చెన్నూర్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు పోటీ ఓసారి విజయం సాధించారు. ప్రస్తుతం బెల్లంపల్లి నుంచి రెండోసారి పోటీ చేస్తున్నారు. 51 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి సాధారణ కుటు ంబంలో జన్మించారు. డిగ్రీ వరకు చదివారు. ఆమె భర్త రాజేశ్వర్ సింగరేణిలో అధికారిగా పని చేస్తున్నారు. ఆమెకు నలుగురు సంతానం. మూడుసార్లు ఎన్నికల్లో పోటీ చేసిన శ్రీదేవి పాత ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం నాలుగోసారి బరిలో ఉన్నారు.

నిర్మల్ నియోజకవర్గంలో..

నిర్మల్‌ఖిల్లా/భైంసాటౌన్: 74 ఏళ్లున్న నిర్మల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఎల్‌ఎల్‌బీ పూర్తిచేసి న్యాయవాద వృత్తి స్వీకరించిన తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించారు. 54 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిగ్రీ పూర్తి చేశారు. 62 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసి కొంతకాలం న్యాయవాద వృత్తిలో ఉండి రాజకీయాల్లోకి వచ్చారు. అలాగే బీఎస్పీ అభ్యర్థి డీ జగన్మోహన్ ఎల్‌ఎల్‌బీ, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి స్వదేశ్ పరికిపండ్ల, యుగ తులసి, ధర్మ సమాజ్, అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రీఫామ్స్ అభ్యర్థులు, స్వతంత్రులుగా బరిలో నిలిచిన వారంతా డిగ్రీ, పీజీ పూర్తి చేసినవారే.

ముధోల్ నియోజకవర్గంలో..

69 ఏళ్లున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డిగారి విఠల్‌రెడ్డి ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసి దాదాపు 20 ఏళ్ల పాటు భైంసాలో న్యాయవాదిగా పనిచేశారు. భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చేశారు. 2009లో పీఆర్పీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన విఠల్‌రెడ్డి, 2014లో కాంగ్రెస్ నుంచి పోటీచేసి గెలుపొందారు. తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరి, 2018లో గెలిచారు. 64 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి భోస్లే నారాయణరావుపటేల్ ఇంటర్ పూర్తి చేశారు. ముధోల్ ఎమ్మెల్యేగా రెండుసార్లు పని చేశారు. 69 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి పవార్ రామారావుపటేల్ డిగ్రీ పూర్తి చేశారు. 2018లో కాంగ్రెస్‌లో చేరి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. అదే ఏడాది ముధోల్ బరిలో నిలిచి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తదనంతరం డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతూ గతేడాది బీజేపీలో చేరారు.


సిర్పూర్ నియోజకవర్గంలో..

కౌటాల: 68 ఏళ్లున్న సిర్పూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప ఇంటర్ వరకు కాగజ్‌నగర్‌లో చదివారు. 48 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్ 1 నుంచి 10వ తరగతి వరకు కాగజ్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించారు. హైదరాబాద్‌లో ఇంటర్, డిగ్రీ బీఏ చదివారు. 44 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్‌లో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. 2004లో ఎంబీబీఎస్, 2010లో ఎంఎస్(ఆర్థోపెడిక్స్) పూర్తి చేశారు. 2011లో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ నుంచి డీఎన్‌బీ పట్టా పొందారు. 56 ఏళ్లున్న బీఎస్పీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ 1 నుంచి 10వ తరగతి వరకు ఆలంపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్తి చేశారు. వెటర్నరీ వైద్య వృత్తి కోర్సును హైదరాబాద్ ఎన్టీరంగ యూనివర్సిటీలో చదివారు. 1995లో ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. హార్వర్డ్ యూనివర్సిటీ ఇన్ పబ్లిక్‌లో ఉన్నత చదువు పూర్తిచేశారు. 2020 ఆగస్టు 8న తన ఉద్యోగానికి రాజీనామా చేసి బీఎస్పీలో చేరి రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: 54 ఏళ్లున్న ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి పదో తరగతి చదివారు. 36 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి అజ్మీరా ఆత్మారాంనాయక్ బీఎస్సీ(బీజెడ్సీ), మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్స్ విద్యనభ్యసించారు. 53 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్ బీఈ, బ్యాచ్‌లర్ ఆఫ్ జర్నలిజం (ఉస్మానియా), ఎల్‌ఎల్‌బీ శాతవాహన యూనివర్సిటీలో పూర్తిచేశారు. ఎంపీపీగా పనిచేసి ప్రజాసేవ చేసేందుకు కాంగ్రెస్‌లో చేరారు. ఆయన భార్య రేఖానాయక్ ఖానాపూర్ ఎమ్మెల్యే.

కారు జోరా?.. 'హస్త'గతమా?



- కార్మికుల అండ ఏ జెండాకు?
- సింగరేణి పరిధిలో 11 స్థానాలు
- గత ఎన్నికల్లో ఆరు 'హస్త'గతం.. మూడు స్థానాల్లో కారు గెలుపు
- ఈసారి పాగా వేసే పార్టీ ఏదో!

శ్రీరాంపూర్: ఉద్యమాల పురిటిగడ్డగా పేరున్న సింగరేణిలో కార్మికవర్గం ఎప్పుడూ విలక్షణమైన తీర్పు ఇస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల్లో ఏ పార్టీ హవా ఎలా ఉన్నా కార్మిక క్షేత్రాలకు వచ్చేసరికి పరిస్థితి భిన్నంగా ఉంటోంది. దీనికి గత 2018 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం. నాటి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ అంతటా కారు జోరు కొనసాగినా కోల్‌బెల్ట్ ప్రాంతానికి వచ్చేసరికి భిన్నమైన తీర్పు వచ్చింది. నాడు ఈ ఫలితాలు చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఆ ఎన్నికల్లో కోల్‌బెల్ట్ మెజార్టీ సీట్లు కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది. ఈసారి తీర్పు ఎలా ఉంటుంది? ఏ పార్టీకి పట్టం కడతారు? అని అంతటా చర్చ సాగుతోంది. కార్మికుల అండ ఏ జెండాకు ఉంటుందనే దానిపై పార్టీలన్నీ దృష్టి సారించి ప్రచారం ముమ్మరం చేస్తున్నాయి. పార్టీలు.. వాటి అనుబంధ కార్మిక సంఘాలకు సింగరేణిలో ఉన్న బలంతో గట్టెక్కడానికి ప్రయత్నం చేస్తున్నాయి. ఈ క్రమంలో గత వైభవాన్ని కాపాడుకోవడం కోసం కాంగ్రెస్, గులాబీ మయం చేయడానికి బీఆర్‌ఎస్ తీవ్ర ప్రయత్నం చేస్తున్నాయి

ఆరు జిల్లాలు.. 11 స్థానాలు..

తెలంగాణలో సింగరేణి ఆరు జిల్లాల్లో విస్తరించి ఉంది. 11 అసెంబ్లీ స్థానాల్లో ప్రత్యక్షంగా, మరో మూడు అసెంబ్లీ స్థానాల్లో పరోక్షంగా సింగరేణి ఓటర్లు అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేస్తారు. గత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 11 స్థానాల్లో మూడు స్థానాల్లో మాత్రమే బీఆర్‌ఎస్ గెలిచింది. ఆరు స్థానాలను కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది. మిగతా రెండింటిని టీడీపీ, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకున్నాయి. వీరిలో కాంగ్రెస్ నుంచి గెలిచిన తర్వాత మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మినహా మిగతా వారంతా ఆ పార్టీని వీడి కారెక్కారు. నాడు కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన వారే నేడు బీఆర్‌ఎస్ నుంచి పోటీలో నిలవడం కొసమెరుపు. ఈ నేపథ్యంలో పార్టీ మారిన అభ్యర్థుల బలం గెలుస్తుందా? పార్టీ బలం గెలుస్తుందా? అన్నది తేలాల్సి ఉంది.

చేసిన మేలే గెలిపిస్తుందని బీఆర్‌ఎస్..

కార్మికులకు తమ హయాంలో చేసిన మేలు, కల్పించిన హక్కులు, సదుపాయల గురించి బీఆర్‌ఎస్ నేతలు ప్రచారంలో వివరిస్తున్నారు. కార్మికుల చిరకాల కోరిక అయిన కారుణ్య ఉద్యోగాల కల్పన, టీబీజీకేఎస్ సాధించిన విజయాలు లాభం చేస్తాయని బీఆర్‌ఎస్ నాయకత్వం విశ్వసిస్తోంది. ఆదాయ పన్ను కూడా మాఫీ చేయిస్తానని ఇటీవల మందమర్రిలో జరిగిన సభలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి కార్మికుల ఓట్లు రాబట్టే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ సింగరేణికి చేసిన అన్యాయాన్నే బీఆర్‌ఎస్ నేతలు నేటి ప్రచారంలో ఏకరువు పెడుతున్నారు. అందుకే కేసీఆర్ సింగరేణి మంచిర్యాల, కొత్తగూడెంలో ఇటీవల నిర్వహించిన సభల్లో సింగరేణి ఓట్లు రాబట్టేందుకు తన ఉపన్యాసంలో నాటి సింగరేణి దుస్థితికి కారణం కాంగ్రెస్ అని, కాంగ్రెస్‌తోనే సింగరేణిలో 49 శాతం వాటా కేంద్రానిది అయ్యిందంటూ తూర్పారబడుతున్నారు.

పూర్వవైభవం కోసం కాంగ్రెస్..

2018 ఎన్నికల్లో సింగరేణి ఆరు జిల్లాల్లో గెలిచిన మూడు బీఆర్‌ఎస్ స్థానాలు కూడా మంచిర్యాల జిల్లా నుంచి కావడం విశేషం. బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల స్థానాలు మినహా మిగతా చోట్ల బీఆర్‌ఎస్ గెలవలేదు. కొత్త గనులు రాకపోవడం, సింగరేణిలో జరుగుతున్న ప్రైవేటీకరణ, సంస్థలో పెరిగిన రాజకీయ జోక్యం, రూ.వేల కోట్లు ప్రభుత్వ సంస్థలు సింగరేణికి బాకీ పడటం తదితర సమస్యలను కాంగ్రెస్ ఏకరువు పెట్టి గత వైభవాన్ని కాపాడుకునేలా ప్రచారం చేస్తోంది. కాగా, ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర పోటీలో ప్రస్తుతం ఈ 11 స్థానాలు కూడా ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించే అవకాశం కూడా లేకపోలేదు. ఈ తరుణంలో కార్మికులు ఇచ్చే తీర్పు ఎంతో కీలకం కానుంది.

వివిధ పార్టీల నుంచి గెలిచి కారెక్కి..

గత ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి గెలిచిన నేతలు ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్నారు. ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఆత్రం సక్కు, రామగుండంలో ఫార్వర్డ్ బ్లాక్ నుంచి విజయం సాధించిన కోరుకంటి చందర్, భూపాలపల్లిలో కాంగ్రెస్ నుంచి గెలిచిన గండ్ర వెంకటరమణారెడ్డి, కొత్తగూడెంలో కాంగ్రెస్ నుంచి విజయం సాధించిన వనమా వెంకటేశ్వర్‌రావు, ఇల్లందులో కాంగ్రెస్ నుంచి గెలిచిన బానోత్ హరిప్రియ, పినపాకలో కాంగ్రెస్ నుంచి విజయం సాధించిన రేగా కాంతారావు, సత్తుపల్లిలో టీడీపీ నుంచి గెలిచిన సండ్ర వెంకటవీరయ్య ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్నారు.

2018లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

నియోజకవర్గం	పార్టీ	గెలిచిన అభ్యర్థి
ఆసిఫాబాద్	కాంగ్రెస్	ఆత్రం సక్కు
బెల్లంపల్లి	బీఆర్‌ఎస్	దుర్గం చిన్నయ్య
చెన్నూరు	బీఆర్‌ఎస్	బాల్క సుమన్
మంచిర్యాల	బీఆర్‌ఎస్	ఎన్.దివాకర్‌రావు
రామగుండం	ఫార్వర్డ్ బ్లాక్	కోరుగంటి చందర్
మంథని	కాంగ్రెస్	దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
భూపాలపల్లి	కాంగ్రెస్	గండ్ర వెంకటరమణారెడ్డి
కొత్తగూడెం	కాంగ్రెస్	వనమా వెంకటేశ్వర్‌రావు
ఇల్లందు	కాంగ్రెస్	బానోత్ హరిప్రియ
పినపాక	కాంగ్రెస్	రేగా కాంతారావు
సత్తుపల్లి	టీడీపీ	సండ్ర వెంకటవీరయ్య

'ఎస్సీలను వర్గీకరిస్తే ఊరుకోం'



ఐక్యత చాటుతున్న మాల సంఘం నాయకులు

బెల్లంపల్లి: ఎస్సీలను వర్గీకరిస్తే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి బుద్ధి చెబుతామని మాల ప్రజాసంఘాల రాష్ట్ర జేఏసీ చైర్మన్ జీ చెన్నయ్య పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంపల్లిలోని కాంటా చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ కులరాజకీయాలకు పాల్పడుతోందని, ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాయమాటలు చెప్పి అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. మాల ప్రజాసంఘాల వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, రమేశ్, శ్రీధర్‌రావు, సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కుంబాల రాజేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లయ్య, ప్రధాన కార్యదర్శి యాదగిరి, నాయకులు మధుకర్, మధు, ప్రభాకర్, ప్రతాప్, మురళి, జనార్దన్, ప్రదీప్, తిరుపతి ఉన్నారు.

అమలుకు నోచుకోని సర్క్యులర్



సమయం గడిచినా నిర్మానుష్యంగా డిస్ట్రిబ్యూషన్ పాయింట్లు

- ఉత్పత్తికి తప్పని తిప్పలు

కాసిపేట: ఎన్నికల నేపథ్యంలో ఉత్పత్తికి ఇబ్బంది కలగకుండా గనుల ఆవరణలో సమావేశాలు, ప్రచారం నిర్వహించడాన్ని నిషేధిస్తూ సింగరేణి యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్ అమలుకు నోచుకోవడంలేదు. దీంతో ఆయా పార్టీలు ఎన్నికల సమావేశాలు గని బయట నిర్వహిస్తున్నాయి. కాగా, గని బయట నిర్వహిస్తున్న సమావేశాలకు కార్మికులు వెళ్తుండడంతో అరగంటకు మించి సమయం అదనంగా గడుస్తుండగా ఉత్పత్తికి ఇబ్బంది తప్పడం లేదు. ఈ తీరును చూస్తే పెనం మీది నుంచి పొయ్యిలో పడినట్లయింది అధికారుల పరిస్థితి. శుక్రవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య గని బయట సమావేశం నిర్వహించారు. దీంతో టీబీజీకేఎస్ శ్రేణులు కార్మికులను మీటింగ్ వద్దకు తరలించగా ఉదయం 8.25గంటలకు కార్మికుల డిస్ట్రిబ్యూషన్ ప్రారంభమైంది. ప్రతీరోజు ఉదయం 7.15గంటలకు మస్టర్లు పడిన కార్మికులను 7.30గంటల నుంచి పనిస్థలాలు కేటాయించి పనులకు పంపిస్తారు. సమావేశాలతో గంట ఆలస్యంగా పనుల కేటాయింపు చేపట్టడం చర్చనీ యాంశమైంది. గని ఆవరణలో సమావేశం నిర్వహిస్తే 10నుంచి 15నిమిషాలు ఆలస్యం కాగానే అధికారులు కార్మికులను పిలుస్తూ డిస్ట్రిబ్యూషన్ ప్రారంభిస్తారు. గని బయట సమావేశాలు పెట్టడంతో చేసేదేమీ లేక మిన్నకుండిపోయారు. మరోవైపు గుర్తింపు సంఘం నాయకులు కావడంతో వద్దు అని బద్నాం కావడం.. వారితో శత్రుత్వం పెంచుకోవడం ఎందుకు? అని అధికారులు మిన్నకుండిపోయారు. ఈకారణం చూపి మరో రాజకీయ పార్టీ మీటింగ్ పెట్టినా అధికారులు వేచి చూడాల్సిందే. ఈ తరుణంలో సర్క్యులర్‌తో అదనంగా నష్టమే గాని ఎలాంటి ప్రయోజనం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా మరో 10 రోజులు అధికారులకు సర్క్యులర్‌తో తలనొప్పులు తప్పేలా లేవు.

మిస్సింగ్ కేసు నమోదు



కృష్ణ (ఫైల్)

తిర్యాణి: మండలంలోని గంభీరావుపేట గ్రామానికి చెందిన యువకుడు సిరి పురం కృష్ణ ఈనెల 16న ఉదయం తాండూర్ ఐబీకి వెళ్లి వస్తానని కుటుంబసభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. అతడికి ఫోన్ చేస్తే సెల్ స్విచాఫ్ వచ్చింది. ఎంత వెతికినా అతడి ఆచూ కీ లభించలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మే రకు శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.